క్లుప్తంగా

గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని మన బడి నాడు-నేడు రెండవ విడత పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యంలతో స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నాడు-నేడు మొదటి విడతలో 27 పాఠశాలల్లో రూ.5 కోట్లతో పనులు పూర్తి అయ్యాయని, అదేవిధంగా రెండవ విడత విడతలో రూ.6 కోట్లతో 22 పాఠశాలల్లో జరుగుతున్న పనులు వేగవంతం చేసి పూర్తిచేయాలన్నారు. నాడు-నేడు పనులతో పాఠశాలల భవనాల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు.

రేపటి నుంచి ఉచిత చదరంగ శిక్షణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 5-15 ఏళ్ల లోపు బాలబాలికలకు ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచిత చదరంగ శిక్షణ ఇవ్వనున్నట్లు ది చిల్డ్రన్ చెస్ అసోసియేషన్ నిర్వాహకులు అంజూరు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చివరి రెండు రోజుల చదరంగ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. శిక్షణకు వచ్చే వారు చదరంగ బోర్డు, కాయిన్స్, 200 పేజీల బుక్, పెన్, పెన్సిల్, రెడ్‌పెన్ తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలకృష్ణాపురంలో వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని బాలకృష్ణాపురంలో గురువారం ఏర్పేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ దీప మాట్లాడుతూ గ్రామాల్లో 30 ఏళ్లు పైబడిన వారికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ జయచిత్ర పాల్గొన్నారు.


ఈత సరదా.. వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి:తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగలో ఈత సరదాతో రాజేష్(30) అనే వ్యక్తి మృతి చెందాడు. రెండవ పట్టణ సీఐ రారాజు కథనం మేరకు కొత్తకండ్రిగకుచెందిన రాజేష్ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన నలుగురు స్నేహితులతో కలిసి గురువారం ఈత కొట్టేందుకు బసవయ్యపాళెంలోని బావిలో దిగాడు. రాజేష్ ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో స్నేహితులు 100కు ఫోన్ చేశారు. అగ్నిమాపక సిబ్బంది, రెండవ పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని బావి అడుగులో ఉన్న మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కంటైనర్ - బైక్ ఢీ

నాగలాపురం: మండలంలోని కృష్ణాపురం వద్ద తిరుపతి-చెన్నై జాతీయ రహదారిలో గురువారం కంటైనర్, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం మేరకు.. నాగలాపురం మండలం వినోభానగర్ గ్రామానికి చెందిన మోహన్, బాబు ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతున్నారు. కృష్ణాపురం వద్ద కంటైనర్ లారీ, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో మోహన్, బాబుకు తీవ్ర గాయలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో నగరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాగలాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృగరాజుపై కల్యాణ వెంకన్న



సింహవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం జగతికి వెలుగునిచ్చే దినకరుని అవతారంలో సింహవాహనాన్ని అధిరోహించిన కల్యాణ వేంకటేశ్వరుడు రాత్రి ఆబాల భూపాలాన్ని సంరక్షించే కృష్ణావతరంలో ముత్యపుపందరి వాహనంలో ఉభయనాంచారులతో గ్రామోత్సవాలలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కార్యక్రమాలతో పాటు నిర్మిత హోమశాలలో ప్రత్యేక హోమాలను పూర్తి చేశారు. తొలిగంటతో నైవేద్య సమర్పణ చేశారు. 7.30 గంటలకు సుగంధ పుష్పమాలికలు, స్వర్ణాభరణాలను అలంకరించుకుని స్వామివారు వెలుగును నింపే యోగముద్రలో సూర్యదేవునిగా సింహవాహనంపై అధిష్ఠించారు. మేళతాళాలు, వేదమంత్రాలు, భక్త బృందాల కోలా టాలు, డప్పుల వాయిద్యాల మధ్య గోవింద నామస్మరణలతో స్వామివారి ఊరేగింపు గ్రామ వీధుల్లో కొనసాగింది. మహిళలు కర్పూర హారతులు పట్టారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవ మూర్తులు ఉభయ నాంచారులతో స్నపన తిరుమంజనంలో సేదదీరారు.

పార్థసారథిగా ముత్యపుపందిరిపై..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం పూజా కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. కురుక్షేత్రంలో పార్థునికి జ్ఞానబోధ చేసిన కృష్ణావతారంలో రుక్మిణీ సమేతుడై ఊంజల్‌సేవలో పాల్గొన్నారు. రాత్రి 7.30 గంటలకు ముత్యాలతో, సుగంధ పుష్పమాలికలతో సుందరంగా అలంకరించిన ముత్యపు పందిరి వాహనాన్ని అధిరోహించిన ఉత్సవర్లు ఊరేగింపుగా బయలుదేరాలు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించిన అర్చకులు భోగ శ్రీనివాసునికి పవళింపు సేవను నిర్వహించారు. డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, నరసింహ భట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, ఇంజినీరింగ్ ఏఈ గురుప్రసాద్ పాల్గొని పర్యవేక్షించారు.

ఉత్సవాల్లో నాలుగో రోజు శుక్రవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై, రాత్రి సర్వభూపాల వాహనంపై భక్తులకు స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.



స్వామివారి ఊరేగింపు సేవలో బాల కళాకారులు



ముత్యపు పందిరి వాహనంలో పార్థసారథిగా..

గంగమ్మను దర్శించుకున్న నూకతోటి రాజేష్

నారాయణవనం: మండలంలోని పాలమంగళం దక్షిణపుకండ్రిగ గ్రామ జాతర సందర్భంగా గురువారం రాత్రి సత్యవేడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. నడివీధిలో కొలువుదీరిన గంగమ్మను దర్శించుకున్న రాజేష్‌కు సర్పంచ్ ప్రేమలత, మాజీ సర్పంచ్ మార్కండేయరెడ్డి, యువత దర్శన ఏర్పాట్లు చేసి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఐక్యతను చాటుకుని జాతరను నిర్వహించిన యువతను రాజేష్ అభినందించారు. మరోమారు జగనన్న సీఎంగా రావాలని, సంక్షేమం, అభివృద్ధి పాలన నిర్విరామంగా కొనసాగాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు రాజేష్ పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటోవాలాలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆటోవాలాలు మెయిన్‌రోడ్డుపై అడ్డగోలుగా ఆటోలను నిలపకూడదని ఎస్‌ఐ వెంకటనరసింహం సూచించారు. గురువారం ఆయన పోలీసుస్టేషన్‌లో ఆటోవాలాలతో సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ కూలీలను పరిమితికి మించి ఆటోల్లో ఎక్కించకూడదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన రికార్డులను తప్పనిసరిగా పోలీసులకు చూపించాలని తెలిపారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరికైనా రోడ్డు ప్రమాదం జరిగితే వారిని ఆస్పత్రిలో చేర్పించితే, సమార్‌తన్ పథకంలో నగదు బహుమతి అందిస్తారని, ఈ అవకాశాన్ని ఆటోవాలాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎస్‌ఐ రమేష్‌బాబు, కానిస్టేబుళ్లు ప్రభాకర్, అరుణ్, నరేష్ పాల్గొన్నారు.

ఎండీ పుత్తూరులో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



వైద్య సిబ్బందితో సర్పంచ్ మోహనప్రియ



రోగుల వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరులో గురువారం సర్పంచ్ మోహన ప్రియ, స్విమ్స్ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎండీ పుత్తూరు, మిట్ట ఇండ్లు, అరుంధతీవాడ, ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచి వచ్చిన 70 మంది రోగులకు మెమోగ్రామ్, అల్ట్రాస్కానింగ్ పేపస్మియర్, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మమ్మ, పంచాయతీ కార్యదర్శి లోకముని, డాక్టర్లు స్రవంతి, పూజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురి బైండోవర్



డీటీ వద్ద బైండోవర్ చేస్తున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో భాగంగా ఎలాంటి గొడవలు జరగకుండా ఉండడం కోసం గురువారం ఐదుగురిని బైండోవర్ చేసినట్టు డీటీ చంద్రబాబునాయుడు తెలిపారు. కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో గొడవలు జరగకుండా ఉండడం కోసం ముందుస్తుగా బైండోవర్ చేసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు 270 మందికి పైగా బైండోవర్ చేసినట్లు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ మల్లికార్జున

రేణిగుంట: ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, దానికి అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున సూచించారు. పట్టణంలోని వేణుగోపాలపురంలో గురువారం కార్డెన్ అండ్ సర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఎవరూ ఎలాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడవద్దని స్థానికులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట అర్బన్ పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు



బుచ్చినాయుడుకండ్రిగలోని పరీక్ష గది

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి 31వ తేదీ వరకు జరగనున్న పది సప్లిమెంటరీ పరీక్షల కోసం గదులు, సౌకర్యాలను సిద్ధం చేసినట్లు ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. ఆయన గురువారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్ష గదులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం మండలాలకు చెందిన పదవ తరగతి ఫెయిలైన 142 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులకు తాగునీటి సౌకర్యంతోపాటు వైద్య సిబ్బంది అందుబాటు ఉంటారన్నారు. విద్యార్థులకు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు.

అలంకారప్రాయంగా వర్షపు నీటి తొట్టె



నిరుపయోగంగా రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ తొట్టె

సత్యవేడు: మండల కేంద్రం కార్యాలయం, ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో నిర్మించిన రెయిన్వాటర్ హార్వెస్టింగ్ తొట్టె అలంకార ప్రాయంగానే ఉంటోంది. ఎనిమిది నెలల క్రితం ఉపాధి కార్యాలయం సమీపంలో ఈ తొట్టెను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం, ఉపాధి కార్యాలయాల మిద్దెపై పడే వర్షపు నీటిని వృథాచేయకుండా నిరోధించేందుకు రెయిన్వాటర్ హార్వెస్టింగ్ తొట్టె ఏర్పాటు చేసి మిద్దెపై పడిన వర్షపు నీరుపైపుల ద్వారా తొట్టెలోకి చేర్చేందుకు రూ.65వేలు ఖర్చుచేసి నిర్మించారు. ఇలా ఏర్పాటు చేస్తే భూగర్భజలాలు పెంచుకునే అవకాశం ఉంటుందని పలువురికి అవగాహన కల్పించారు. కార్యాలయం మిద్దెల పైనుంచి అమర్చిన పైపులు వారం లోపే కోతులు కిందకి జారుతుండడంతో పైపుల జాయింట్లు తొలగిపోయాయి. పైపులు తొలగించి కార్యాయలంలో భద్రరిచారు. పైపులైన్ పూర్తి స్థాయిలోఅమర్చకపోవడంతో మిద్దెపైన చేరిన నీరు వృథాగా పోతుంది. గుంత ఏర్పాటు చేసిన తరువాత ఐదు మార్లు సత్యవేడులో ప్రాంతంలో వర్షపు జల్లులుపడ్డాయి. అయితే ఒక్కసారి కూడా రెయిన్వాటర్ హార్వెస్టింగ్ తొట్టిలోకి చేరలేదు. భూగర్భజలాల స్థాయి పెంచే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన తొట్టె నిరుపయోగంగా మారడంతో సంబంధిత అధికారులు ప్రభుత్వ ధనం వృథా చేశారని, ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో పైపులైన్ అమర్చి ఉపయోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండల పరిధిలో కాళమనాయుడుపేట, బాలికల గురుకుల పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఎన్ అగ్రహారం, వ్యవసాయ కార్యాలయం, బీసీ కాలనీలోని ఎంపీపీ స్కూల్ వద్ద రూ.60 వంతున రెయిన్వాటర్ హార్వెస్టింగ్ తొట్టెలు ఏర్పాటు చేశారు.

ఆలయాల్లో బుద్ధ పౌర్ణమి వేడుకలు





ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి, లక్ష్మీనరసింహస్వామి

నారాయణవనం: పౌర్ణమి సందర్భంగా గురువారం మండలంలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాలను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. స్థానిక సొరకాయల స్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలను నిర్వహించి సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సొరకాయల స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాలను అందుకున్నారు. సింగిరికోనలలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పున్నమి సందర్భంగా శ్రీదేవీభూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామికి అభిషేకాలను చేసి సుందరంగా అలంకరించారు. ధన్వంతరి, మహాలక్ష్మి హోమాలను నిర్వహించారు. సాయంత్రం ఆల య ప్రాకారోత్సవం అనంతరం ఊంజల్‌సేవను నిర్వహించారు.

తొండూరు సొసైటీలో కార్డన్ సెర్చ్



స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ పైడేశ్వరరావు

వరదయ్యపాళెం: శ్రీసిటీ పరిధిలోని తొండూరు సొసైటీలో శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ పైడేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గురువారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసులు మూకుమ్మడిగా ఆ గ్రామంలోని ప్రతి ఇల్లు తనిఖీ చేశారు. ఇళ్లలోని ప్రజల వివరాలతో పాటు వాహనాల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన తొండూరు సొసైటీలో నిర్వహించామన్నారు. తప్పనిసరిగా వాహనాలకు అన్ని రికార్డులు ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎన్నికల ఫలితాల వరకు ఈ గ్రామంపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, అప్పటి వరకు ఈ ప్రాంతంలో రాజకీయ సమావేశాలు, ఇతరత్రా కార్యకలాపాలు అనుమతి లేకుండా నిర్వహించకూడదని స్థానిక రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు. ఎస్‌ఐ గౌస్‌పీర్ పాల్గొన్నారు.

ఆటపాటల బడి.. అంగన్‌వాడీ

సత్యవేడు నియోజకవర్గంలో అంగన్‌వాడీ వివరాలు

మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	378
చిన్నారుల సంఖ్య	4407
బాలింతలు	2040
గర్భిణులు	1835
నాడు-నేడు ద్వారా ఆధునీకరణకు ఎంపిక చేసిన పాఠశాలలు	46
నాడు-నేడు ద్వారా నూతన భవనాలు మంజూరు	15
ఆధునీకరణ పనులకు మంజూరు చేసిన నిధులు (రూ.కోట్లలో)	2.30
నూతన భవనాల నిర్మాణానికి మంజూరు చేసిన నిధులు (రూ. కోట్లలో)	2.40

- ఆంగ్ల మాధ్యమంలో ప్రీస్కూళ్లు
- బొమ్మలతో చిన్నారులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన
- నాడు-నేడుతో నూతన భవనాలు, పాత భవనాలకు ఆధునీకరణ పనులు



అంగన్‌వాడీ కేంద్రంలో గోడలపై ఏర్పాటు చేసిన బొమ్మలు



వరదయ్యపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పాఠాలు చెబుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

వరదయ్యపాళెం: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో వినూత్న మార్పులు తీసుకొచ్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు పిల్లలకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పేందుకు ప్రీస్కూళ్లను ఏర్పాటు చేసింది. ఆ దిశగా టీచర్లను తీర్చిదిద్ది, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. దీంతో వారు ఆటపాటల ద్వారా చిన్నారులకు పాఠాలు బోధిస్తున్నారు. నాడు-నేడు ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను మెరుగైన వసతులతో ఆధునీకరించడంతో పాటు, కొన్నిచోట్ల నూతన భవనాలను నిర్మిస్తున్నారు. ఆ దశగా సత్యవేడు నియోజకవర్గంలో నాడు-నేడు ద్వారా రూ.4.70 కోట్లు అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.



డిజిటల్ విద్యను బోధించేందుకు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ టీవీ



నూతన పద్ధతులలో చిన్నారులకు విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయులు







పిచ్చాటూరు మండలం వేలూరు అంగన్‌వాడీ కేంద్రం, వరదయ్యపాళెం మండలం పులివల్లంలో చిన్నారులకు బోధన చేస్తున్న సిబ్బంది, నాడు-నేడు ద్వారా ఆధునీకరించిన రజానగరం అంగన్‌వాడీ కేంద్రం



ఆధునీకరించిన అంగన్‌వాడీ కేంద్రంలో బోధన